క్లుప్తంగా

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



నందిగామ: రౌడీ షీటర్లు అనవసరంగా వివాదాలకు పోయి ఇబ్బందులు పడొద్దని ఇన్‌స్పెక్టర్ హనీష్ హెచ్చరించారు. పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల తర్వాత రాష్ట్రంలో పలుచోట్ల వివాదాలు జరిగిన నేపథ్యంలో రౌడీ షీటర్లపై ప్రత్యేక నిఘా పెట్టినట్లు తెలిపారు. ప్రతి రౌడీ షీటర్ కదలికలపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు పండు దొర, దుర్గా మహేశ్వర రావు పాల్గొన్నారు.

సత్ప్రవర్తనతో నడుచుకోవాలి..

వీరులపాడు: రౌడీ షీటర్‌లు సత్ప్రవర్తనతో నడుచుకోవాలని ఎస్‌ఐ మహాలక్ష్మణుడు పేర్కొన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో నేరచరిత్ర కలిగిన వారికి ఆదివారం ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రౌడీషీటర్‌లపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. ముఖ్యంగా అల్లర్లు, శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సత్ప్రవర్తనతో నడుచుకుంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వారిపై ఉన్న రౌడీషీట్ రద్దుకు కృషి చేస్తామన్నారు.

నందిగామలో మోస్తరు వర్షం



నందిగామ: నందిగామ ప్రాంతంలో రెండు రోజులుగా వాతావరణం మేఘావృతమై ఉంటోంది. వర్షాకాలం మాదిరిగా పగటి సమయంలో ఎండ కాసినప్పటికీ సాయంత్రం సమయానికి వాతావరణం మారిపోతోంది. ఆదివారం నందిగామ ప్రాంతంలో పగటి సమయంలో భానుడు సాధారణంగానే తన ప్రతాపాన్ని చూపాడు. మధ్యాహ్నం మూడు గంటల సమయానికి ఒక్కసారిగా వాతావరణం మారిపోయి వర్షం కురిసింది. వాతావరణ శాఖ అధికారుల హెచ్చరికల నేపథ్యంలో దాళ్వా సాగు చేస్తున్న రైతులు హడావుడిగా కోతలు కోసి వాటిని తడవకుండా భద్రపరుచుకుంటున్నారు.

శ్రీనివాసునికి పంచామృత అభిషేకాలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని చిట్టినగర్‌లోని శ్రీ పద్మావతి గోదాదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి సన్నిధిలో స్వామివారికి విశేష అభిషేకాలు, అర్చన నిర్వహించారు. తెల్లవారుజామున స్వామి వారికి సుప్రభాత సేవ అనంతరం ఉత్సవ మూర్తికి పంచామృతాలతో అభిషేకాలు, విశేష అలంకరణ, అర్చన జరిపారు. ఆలయ అర్చకులు రత్నమాచార్యులు స్వామి వారికి అలంకరణ, పూజా కార్యక్రమాలను నిర్వహించగా, భక్తులు స్వామివారికి తులసీదళాలను సమర్పించిన తమ నామగోత్రాలతో పూజలు జరిపించుకున్నారు. సాయంత్రం స్వామి వారికి పంచహారతుల సేవ, ఏకాంత సేవ నిర్వహించారు.

1న హనుమత్ జయంతి ఉత్సవాలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): కొత్తపేట ఆంజనేయ వాగు సెంటర్‌లోని శ్రీ వీరాంజనేయ స్వామి వారి దేవస్థానంలో హనుమత్ జయంతి ఉత్సవాలను జూన్ 1వ తేదీ వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో రావూరి వెంకటేశ్వరరావు తెలిపారు. ఉదయం స్వామి వారికి సుప్రభాత సేవ, అనంతరం 108 కలశాల జలాలతో స్వామివారికి అభిషేకం, విశేష అర్చన జరుగుతుందని అర్చకులు ఖండపల్లి త్రినాథ ఆచార్యులు, విన్నకోట శ్రీనివాసరావు శర్మ పేర్కొన్నారు. ఉత్సవాలకు విచ్చేసే భక్తులకు హరిహర అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో అన్న ప్రసాద పంపిణీ జరుగుతుందన్నారు. ఉత్సవాలకు పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చే అవకాశం ఉండటంతో ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా క్యూ లైన్లు, భక్తులకు ఇతర వసతి సదుపాయాలను కల్పించాలని ఆలయ చైర్మన్ నందిపాటి శ్రీనివాసరావు ఆలయ అధికారులకు సూచించారు.

ఆలయ నిర్మాణానికి రూ. లక్ష విరాళం



తిరువూరు: స్థానిక జగన్నాథపురం కాలనీలో పునర్నిర్మిస్తున్న పాటిమీద ఆంజనేయస్వామి ఆలయానికి వ్యాపార ప్రముఖుడు గుడిమెట్ల చిన్న వెంకటేశ్వరరావు రూ.లక్ష విరాళాన్ని ఆదివారం అందజేశారు. దాతల సహకారంతో ఆలయ వంశపారంపర్య ధర్మకర్త వెల్లంకి సురేంద్రబాబు చేపట్టిన నిర్మాణ పనులకు తనవంతుగా ఈ సొమ్ము అందజేశామని వెంకటేశ్వరరావు తెలిపారు. ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పొలానికి నిప్పు..

భూసారానికి ముప్పు

మిత్ర పురుగులు నాశనం.. పర్యావరణానికి హాని

పెనుగంచిప్రోలు: వరి కోతలతో పాటు ఇతర పంటల సాగు పూర్తవటంతో చేలకు రైతులు నిప్పు పెడుతుండటం ఆందోళన కలిగిస్తోంది. ఒక పక్క మండే ఎండలకు తోడు పొలాల్లో మంటలు మరింత కాక పుట్టిస్తున్నాయి. ఈ మంటల నుంచి వచ్చే పొగతో సమీపంలో ఉండే ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. కోత యంత్రాలతో చాలామంది రైతులు వరి కోతలు త్వరగా పూర్తి చేసి ఊపిరి పీల్చుకున్నారు. ధాన్యపు సిరులు ఇళ్లకు తరలించుకున్నారు. కొంతమంది రైతులు పొలాల్లో మిగిలిపోయిన గడ్డిని, మిర్చి, పత్తి కట్టెను తరలించేందుకు ఖర్చు అవుతుందని భావించి, దాన్ని వదిలించుకునేందుకు నిప్పు పెడుతుండటం పరిసర పొలాల రైతులకు శాపంగా మారింది. రైతులు పొలాల్లో గట్లపై కూడా చెత్త, కంప తగలబెట్టేందుకు కూడా మంటలు వేయటంతో చెత్తతో పాటు పచ్చని చెట్లు కూడా అగ్నికి ఆహుతై పర్యావరణానికి హాని కలిగిస్తున్నాయి. ఒక పొలంలో పెట్టిన మంటలు పక్క పొలాలకు కూడా విస్తరించి తీవ్ర నష్టం కలిగిస్తున్నాయి.

తరచూ ప్రమాదాలు..

వేసవి ఉష్ణోగ్రతలతో పాటు వడగాడ్పులతో తరచూ అగ్ని ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. పొలాల్లో మంటల వల్ల గడ్డి మొత్తం కాలి పోవటంతో పశువులకు కూడా మేత దొరకని పరిస్థితి ఏర్పడుతోంది. రైతులు పంట అయిపోయిన తర్వాత వరిగడ్డితో పాటు పత్తి, మిర్చి కట్టెలు పొలంలోనే కాల్చేస్తున్నారు.



పొలాల్లో చెత్తకు నిప్పు పెట్టటంతో రోడ్డు పక్కన కాలిపోయిన మామిడి చెట్లు(ఫైల్)



పొలాల్లో చెత్తకు నిప్పు పెట్టిన రైతులు

తీవ్ర నష్టం..

ఏటా పొలాల్లో వేసిన మంటలకు గట్లపై, రోడ్డు పక్కన ఉండే పచ్చని చెట్లు కాలిపోవటంతో పాటు వేడి మరింత పెరుగుతోంది. గడ్డివాములు, పొలాల్లో సుబాబుల్ చెట్లు, టేకు చెట్లు, మామిడి చెట్లు తగలబడి రైతులు నష్టపోతున్నారు. కొన్నిచోట్ల ఫైర్ సిబ్బంది వచ్చి సకాలంలో మంటలు ఆర్పటం వల్ల కొంత నష్టాన్ని తగ్గిస్తున్నారు. నియోజకవర్గంలో గతేడాది పొలాల్లో గడ్డికి నిప్పు పెట్టిన కారణంగా 20కి పైగా ప్రమాదాలు జరిగినట్లు ఫైర్ అధికారులు చెబుతున్నారు. ఈ ఏడాది కూడా అక్కడక్కడ చిన్న, చిన్న ప్రమాదాలు జరిగాయి.

మిత్ర పురుగులు చనిపోతాయి..



పొలాల్లో కోతల అనంతరం గడ్డిని తగులబెట్టటం వల్ల పంటలకు, భూమికి ఎంతో ఉపకారం చేసే మిత్రపురుగులు నాశనమవుతాయి. మంటల వేడికి భూమి సారం కోల్పోతుంది. కోతలు కోసిన తరువాత గడ్డిని పొలమంతా వెదజల్లి నీరు పెట్టటం వల్ల గడ్డి మొత్తం కుళ్లిపోయి పొలానికి మంచి సేంద్రియ ఎరువుగా ఉపయోగపడుతుంది.

– కె. రామసుబ్బారెడ్డి, మండల వ్యవసాయ శాఖాధికారి, పెనుగంచిప్రోలు

ప్రజానేత 'పుచ్చలపల్లి'కి నివాళులు



పాత మున్సిపల్ కూడలిలో పుచ్చలపల్లి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు



డీవీఆర్ కాలనీలో పుచ్చలపల్లి సుందరయ్య చిత్ర పటం వద్ద నివాళి అర్పిస్తున్న సీపీఎం నాయకులు



సుందరయ్య చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

కంచికచర్ల: కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత, ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించిన పుచ్చలపల్లి సుందరయ్యను ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని సీపీఎం జిల్లా సెక్రటేరియట్ సభ్యుడు కోట కల్యాణ్ అన్నారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతి కార్యక్రమం ఆదివారం జరుపుకున్నారు. ముందుగా సుందరయ్య చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కల్యాణ్ మాట్లాడుతూ సుందరయ్య పేద వర్గాల ఉన్నతి కోసం జీవితాంతం కృషి చేశారన్నారు. ఎంపీ, ఎమ్మెల్యేగా గెలిచి అటు పార్లమెంట్, ఇటు అసెంబ్లీలో ప్రజా సమస్యలపై తన గళాన్ని వినిపించారని గుర్తుచేశారు. నాయకులు షేక్ షఫాతుల్లా, బెజ్జం భూషణం, షేక్ జాహిదా, విమలరావు, కుమారి తదితరులు పాల్గొన్నారు.

జగ్గయ్యపేట పట్టణంలో..

జగ్గయ్యపేట అర్బన్: కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతిని పట్టణంలో ఆదివారం సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక పాత మునిసిపల్ కార్యాలయం కూడలిలో సీపీఎం మండల కార్యదర్శి సోమోజు నాగమణి, డీవీఆర్ నగర్‌లోని సుందరయ్య భవన్‌లో జరిగిన కార్యక్రమంలో సీపీఎం పార్టీ సీనియర్ నాయకుడు కోట కృష్ణ పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సీపీఎం పట్టణ కార్యదర్శి దాసరి నాగేశ్వరరావు, పార్టీ నాయకులు దంతాల వెంకటేశ్వర్లు, కోట రవి కుమార్, కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేటి తరానికి పుచ్చలపల్లి ఆదర్శం

నందిగామ: నేటి తరం యువకులకు పుచ్చలపల్లి సుందరయ్య ఆదర్శప్రాయుడని సీపీఎం నందిగామ కార్యదర్శి కటారపు గోపాల్ అన్నారు. పార్టీ ఆధ్వర్యంలో పట్టణంలోని డీవీఆర్ కాలనీలో ఆదివారం పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు సయ్యద్ ఖాసిం, లాజర్, హుస్సేన్, పుల్లయ్య, గంగాధర్, శ్రీను, కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.

ఘన నివాళి

షేర్‌మహ్మద్‌పేట(జగ్గయ్యపేట): కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతిని ఆదివారం సీపీఎం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఆదర్శప్రాయుడు..

వత్సవాయి: కమ్యూనిస్టు నేత పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని ఆదివారం వత్సవాయిలోనూ సీపీఎం కార్యాలయంలో నిర్వహించారు. సీపీఎం కార్యాలయంలో సుందరయ్య చిత్రపటానికి పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పేదల పక్షాన నిలబడి వారి అభివృద్ధి కోసం పాటుపడిన మహోన్నత వ్యక్తి సుందరయ్య అని కొనియాడారు. ఈ తరం నాయకులు సుందరయ్యను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ కార్యదర్శి తమ్మినేని రమేష్, పార్టీ సీనియర్ నాయకులు చిరుమామిళ్ల హనుమంతురావు, మండల కమిటీ సభ్యులు మండేపుడి చంద్రశేఖర్, కనకపుడి పటేల్, తమ్మినేని రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

నాలుగో దశ క్యాన్సర్‌కు అరుదైన చికిత్స



డాక్టర్ సాయికృష్ణ

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఫోలిక్యులర్ లింఫోమా నాలుగో స్టేజ్‌లో ఉన్న రోగికి విజయవంతంగా చికిత్స అందించామని అమెరికన్ అంకాలజీ వైద్యుడు, అంకాలజిస్ట్ డాక్టర్ సాయికృష్ణ కొల్లూరు ఆదివారం తెలిపారు. నగరానికి చెందిన 62 ఏళ్ల వ్యక్తి ఆరు నెలలుగా బరువు తగ్గడం, తీవ్రమైన వెన్నునొప్పి వంటి సమస్యలతో పలు ఆస్పత్రులకు వెళ్లగా క్షయ వ్యాధిగా భావించి చికిత్స చేశారన్నారు. అనంతరం తమ ఆస్పత్రికి రాగా సమగ్ర పరీక్షలు చేయగా పెద్ద లింప్‌నోడ్స్, ఎముక ప్రమేయంతో ఫోలిక్యులర్ లింఫోమా నాలుగో దశలో ఉన్నట్లు నిర్ధారించినట్లు తెలిపారు. అభివృద్ధి చెందిన దశలో ఉన్న ఒక రకమైన నాన్-హాడ్కిన్ లింఫోమాగా చెప్పారు. ఒక ప్రాంతంలోనే కాకుండా ఎముక మజ్జ, కాలేయం, ప్లీహం, ఊపిరితిత్తుల వంటి అవయవాలకు వ్యాపించిందన్నారు. దీంతో రోగికి అధునాతన చికిత్సా విధానాలతో ఆరు నెలల పాటు ఆరు సైకిల్స్ కీమో ఇమ్యునోథెరపీ చేశామని తెలిపారు. తాము చేసిన కీమోథెరపీకి అద్భుతమైన ప్రతి స్పందన లభించిందని చెప్పారు. దీంతో క్రమేణా లక్షణాలను నుంచి ఉపశమనం పొందారన్నారు. జీవన విధానం కూడా మెరుగుపడిందన్నారు. అధునాతన విధానాలు, సాంకేతిక పరిజ్ఞానం వలనే నాలుగో దశలో ఉన్న క్యాన్సర్‌ను నయం చేయగలిగామని డాక్టర్ సాయికృష్ణ తెలిపారు.

బైక్ చోరీపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఇంటి ముందు పార్క్ చేసిన బుల్లెట్ బైక్ చోరీకి గురైన ఘటన కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఘటనపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొత్తపేట నెహ్రూబొమ్మ సెంటర్‌లో పుట్టా వెంకటేశ్వరరావు కుటుంబం నివాసం ఉంటోంది. వెంకటేశ్వరరావు తన స్నేహితుడైన పిళ్లా వెంకట నారాయణ వద్ద బుల్లెట్ కొనుగోలు చేసి వాడుకుంటున్నాడు. ఈ నెల 3న ఇంటి సమీపంలో పీతల వారి వీధిలో బుల్లెట్ పార్క్ చేసి, తాళం వేశాడు. మరుసటి రోజు ఉదయం లేచి చూసే సరికి బుల్లెట్ కనిపించలేదు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా ఆదివారం కేసు నమోదు చేశారు.

బాటిళ్లలో పెట్రోలు విక్రయిస్తే చర్యలు



కంచికచర్ల పీఎస్‌లో పెట్రోల్ బంకు యజమానులతో మాట్లాడుతున్న సీఐ చంద్రశేఖర్



నందిగామ పట్టణంలోని ఓ పెట్రోల్ బంకులో ఏర్పాటు చేసిన బోర్డ్

కంచికచర్ల: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు పూర్తయ్యేవరకు బాటిళ్లలో లూజ్ పెట్రోలు పోయరాదని నందిగామ రూరల్ సర్కిల్ సీఐ పి. చంద్రశేఖర్ ఆదేశించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆదివారం పెట్రోలు బంక్ యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ మేరకు సీఐ మాట్లాడుతూ, ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పెట్రోల్‌ను ప్లాస్టిక్ బాటిళ్లలో కాని కంటైనర్ ద్వారా కాని, ఇతర పద్ధతులలో లూజు పోయరాదన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలను ఉల్లంఘించినట్లయితే వారిపై చర్యలు తీసుకుని కేసు నమోదు చేస్తామన్నారు. ఒకవేళ ఎవరైన ప్రయాణికుడి వాహనం మార్గ మధ్యలో ఆగిపోతే బాటిళ్ల ద్వారా పెట్రోలు పోయకుండా బంక్ సిబ్బందిని పంపించి వాహనదారుడికి సహకారం చేయాలన్నారు. ఎన్నికల కౌంటింగ్ పూర్తయ్యేవరకు బాటిళ్లలో కాని కంటైనర్ లేదా ఇతర పద్ధతులలో లూజు పెట్రోలు పోయరాదని సీఐ తెలిపారు. సమావేశంలో ఎస్‌ఐ–2 హైమావతి, పెట్రోలు బంక్ యజమానులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాటిల్లో పెట్రోల్ ఇవ్వం..

నందిగామ: ఎన్నికల నేపథ్యంలో ఇటీవల పలుచోట్ల జరిగిన వివాదాల నేపథ్యంలో అధికారులు పెట్రోల్ బంకుల యజమానులకు పలు ఆదేశాలు జారీ చేశారు. పెట్రోల్ బంకులలో కేవలం వాహనాలకు మాత్రమే పెట్రోల్, డీజిల్ కొట్టాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో ఆదివారం నందిగామ పట్టణంలోని పలు పెట్రోల్ బంకులలో బాటిల్స్, డబ్బాలలో పెట్రోల్ కొట్టబడదు అంటూ సంబంధిత బంకులో యజమానులు ప్రత్యేక బోర్డులను ఏర్పాటు చేశారు.

విజ్ఞానం కోసం సమ్మర్ క్యాంపులు



కంచికచర్ల గ్రంథాలయంలో చెస్ ఆడుతున్న విద్యార్థులు



విద్యార్థులకు జాతీయ పతాకం గురించి అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయుడు లక్ష్మణరావు

కంచికచర్ల: వేసవి సెలవులను విద్యార్థులు వృథా చేసుకోకుండా వారిలో విజ్ఞాన, సాంస్కృతిక, సృజనాత్మకత పెంపొందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేసిందని గ్రంథపాలకుడు అల్లూరు రామచంద్రుడు తెలిపారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం సమ్మర్ క్యాంపులో భాగంగా రాష్ట్ర పౌర గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరం మూడో రోజు ఆదివారం కొనసాగింది. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఎండలో తిరగకుండా ఉండేందుకు వారికి వినోదం, విజ్ఞానం అందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడుతున్నాయన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు పలు విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో తెలుగు ఉపాధ్యాయుడు షేక్ ఇస్మాయేల్, నీలం సర్వేశ్వర రావు, ఎం. కనకారావు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వేసవి విజ్ఞాన శిబిరం

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని జిల్లా గ్రేడ్–1 స్థాయి గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం ఉత్సాహంగా కొనసాగుతుంది. ఆదివారం విద్యార్థులతో పుస్తక పఠనంలో భాగంగా కథలు, జనరల్ నాలెడ్జ్ పుస్తకాలు చదివించారు. అనంతరం ప్రభుత్వ ఉపాధ్యాయుడు పర్చా లక్ష్మణరావు జాతీయ పతాకాలను విద్యార్థులచే ప్రదర్శింపజేస్తూ దేశభక్తి గీతాలను ఆలపించడం ద్వారా జాతీయ పతాకం గురించి అవగాహన కల్పించారు. గ్రంథాలయాధికారి ఎ.ప్రభ, సిబ్బంది శ్యామల, సత్యావతి పాల్గొన్నారు.

సోషల్ మీడియాపై ఖాకీ కన్ను

వివాదాస్పద పోస్టులు షేర్ చేస్తే కఠిన చర్యలు



నందిగామ: రాష్ట్రంలో ఎన్నికల తర్వాత పలుచోట్ల అల్లర్లు జరిగిన నేపథ్యంలో పోలీసులు సోషల్ మీడియాపై ప్రత్యేక నిఘా పెట్టారు. నానాటికి పెరుగుతున్న సోషల్ మీడియా ప్రభావంతో వివాదాలు చెలరేగే అవకాశం ఉందని భావించిన పోలీసులు ఆయా ప్రాంతాలలోని సోషల్ మీడియా గ్రూపులపై దృష్టి పెట్టారు. ముఖ్యంగా ఇటీవల సోషల్ మీడియా వేదికగా అనేకమంది మెసేజ్‌లు, ఫొటోలు, వీడియోల ద్వారా సందేశాలను ఫార్వర్డ్ చేస్తున్నారు. వాళ్లు ఫార్వర్డ్ చేస్తున్న మెసేజ్, వీడియోలు వాస్తవమా కాదా అనేది కూడా కనీసం ఆలోచించడం లేదు. ఒక్కో సందర్భంలో ఫేక్ మెసేజ్‌లను ఫార్వర్డ్ చేయడం వల్ల తెలియకుండానే వివాదాలు చోటుచేసుకున్న సంఘటనలు అనేకం ఉన్నాయి. ఇదిలా ఉండగా ఇటీవల ఎన్నికల సందర్భంలో పలుచోట్ల అల్లర్లు జరిగిన నేపథ్యంలో సోషల్ మీడియానే ఎక్కువ ప్రభావం చూపిందని నమ్మిన అధికారులు ఆ దిశగా ప్రత్యేక దృష్టి పెట్టారు.

నందిగామలోనూ..

ప్రతి మండల పరిధిలనూ సోషల్ మీడియా గ్రూపులు, సోషల్ మీడియాలో ఎక్కువ చురుకుగా ఉండేవాళ్లు, తరచూ వివాదాస్పద పోస్టింగ్‌లు పెట్టే వాళ్లపై పోలీసులు ఓ కన్నేశారు. ప్రతి గ్రూపులోను వస్తున్న మెసేజ్‌లను పరిశీలించేందుకు సిబ్బందిని ఏర్పాటు చేశారు. సంబంధిత గ్రూపుల్లో ఏమైనా వివాదాస్పద మెసేజ్‌లు, వీడియోలు, ఫొటోలను ఎవరైనా పోస్టు చేస్తే వెంటనే వారిని గుర్తించే విధంగా నిఘా ఏర్పాటు చేశారు.

అనవసరంగా షేర్ చేయొద్దు..

దీనిపై నందిగామ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ హనీష్‌ను వివరణ కోరగా ముందు జాగ్రత్తగా సోషల్ మీడియాపై ప్రత్యేక నిఘా పెట్టినట్లు తెలిపారు. ఎవరైనా వివాదాస్పద మెసేజ్‌లు, వీడియోలు, ఫొటోలు అనవసరంగా గ్రూపులలో పోస్ట్ చేస్తే అటువంటి వారిపై చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే వాళ్లని గుర్తించి అటువంటి వారిపై నిఘా ఉంచినట్లు తెలిపారు.


సామినేని విశ్వనాథం జీవితం ఆదర్శనీయం



విశ్వనాథం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కేడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ తన్నీరు తదితరులు

జగ్గయ్యపేట అర్బన్: నిబద్ధత, క్రమశిక్షణ గల నాయకుడిగా పేట ప్రాంత ప్రజల హృదయాలలో చెరగని ముద్రవేసుకున్న గొప్ప వ్యక్తి సర్దార్ సామినేని విశ్వనాథం అని పలువురు వక్తలు అన్నారు. పట్టణ ప్రథమ సర్పంచ్, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను తండ్రి విశ్వనాథం జయంతి వేడుకలు పట్టణంలో ఆదివారం ఆయన అభిమానులు, వైఎస్సార్ సీపీ శ్రేణుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఉదయభాను నివాసంలో జరిగిన కార్యక్రమంలో విశ్వనాథం చిత్రపటానికి కేడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తన్నీరు నాగేశ్వరరావు మాట్లాడుతూ విశ్వనాథం జీవితం ఆదర్శనీయమన్నారు. మార్కెట్ యార్డు చైర్మన్ మానేపల్లి బ్రహ్మం, పార్టీ వాణిజ్య విభాగం అధ్యక్షుడు చారుగుండ్ల కొండ, పార్టీ ప్రతినిధులు కృష్ణప్రసాద్(కేపీ), ముత్యాల శేషు, బాలకోటి, పెదవల్లి బుజ్జి, టీఎస్.బ్రహ్మం, గుంటుపల్లి సీతారామయ్య పాల్గొన్నారు.

స్మృతివనంలో పర్యాటకుల సందడి





విజయవాడలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతివనంలో పర్యాటకుల సందడి నెలకొంది. ఆదివారం సెలవు కావడంతో పెద్ద సంఖ్యలో పర్యాటకులు తరలివచ్చి స్మృతివనాన్ని సందర్శించారు. దీంతో స్మృతివనం ప్రాంగణం పర్యాటకులతో కిటకిటలాడింది. – సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

నందిగామ డివిజన్

79950 92114 (నందిగామ)
99122 20547 (జగ్గయ్యపేట)

Office mail : sakshiads@gmail.com